ఇంటర్‌నెట్‌లో
'ఇంద్రప్రభ'
www.indraprabha.com
వెబ్‌సైట్ ద్వారా చూడవచ్చు. ఆన్‌లైన్ ద్వారా ప్రకటనలను ఇచ్చేందుకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్
73864 93385
email :indraprabhaknr@gmail.com

నవతరం తెలుగు దినపత్రిక
# ఇంద్రప్రభ
నిజం మా ఆయుధం

విలేకరులు కావలెను
ఇంద్రప్రభ దినపత్రిక తెలుగు రాష్ట్రాలల్లో, జిల్లాల్లో, మండలాల వారిగా, విలేకరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు, తెలుగు భాషా పరిజ్ఞానం కల్గి ఉండి, సామాజిక పరిసర ప్రాంతాలపై అవగాహన కల్గి ఉండి వాక్‌చాతుర్యం గల అభ్యర్థులకు విలేకరులుగా పనిచేయుటకు అవకాశం కల్పిస్తున్నాం
ఎడిటర్: బోనాల తిరుమల్ 73864 93385

: Published at karimnagar, Circulated in: Telangana    మంగళవారం16-06-2026 సంపుటి : 15, సంచిక :352    పేజీలు. 8, వెల రూ. 3

## వర్షాల నేపథ్యంలో
# అధికారుల సమన్వయ లోపంపై
## సీఎం రేవంత్ రెడ్డి ఫైర్

తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రకృతి విపత్తుల నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సచివాలయంలో ఉన్నత స్థాయి అత్యవసర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వివిధ విభాగాల మధ్య పరస్పర సమన్వయాన్ని మరింత పెంపొందించుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. శాఖల మధ్య సమన్వయ లోపంపై ముఖ్యమంత్రి అసంతృప్తిజూన్ 1న నిర్వహించిన ముందస్తు సమీక్షా సమావేశంలోనే స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినప్పటికీ, జూన్ 9న కురిసిన వర్షాల సమయంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందిందని సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని, కొందరు అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో వర్షాలు కురిసే సమయంలో జీహెచ్ఎంసీ, పోలీస్, ట్రాఫిక్, విద్యుత్ శాఖలకు చెందిన ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు ప్రతి ఒక్కరూ రోడ్లపైనే ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని కరాఖండిగా చెప్పారు. "వరదలు లేదా ట్రాఫిక్ గందరగోళం తలెత్తినప్పుడు అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదు. విధుల్లో అలసత్వం ప్రదర్శించే వారిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు ఉంటాయి. అవసరమైతే నేనే స్వయంగా క్షేత్రస్థాయిలోకి వచ్చి పరిస్థితులను తనిఖీ



చేస్తాను" అని ముఖ్యమంత్రి హెచ్చరించారు. దీంతో పాటు ట్రాఫిక్ నియంత్రణలో ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని అధికారులను ఆదేశించారు.

## చెన్నూరులో 15 రోజుల
## ఉచిత యోగా శిక్షణ శిబిరం ప్రారంభం



చెన్నూర్ ఇంద్రప్రభ జూన్ 15 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని చెన్నూరులోని గాంధీ చౌక్ వద్ద ఉన్న మహేశ్వరి భవన్‌లో సత్వా నేచర్ క్యూర్, యోగా అండ్ ఆయుర్వేద రిట్రీట్ మరియు రాజస్థానీ సమాజ్, చేన్నూరు ఆధ్వర్యంలో 15 రోజుల ఉచిత యోగా శిక్షణ శిబిరం సోమవారం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని చెన్నూరు మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి పెద్దింటి పద్మ గారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రజల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సత్వా నేచర్ క్యూర్, యోగా అండ్ ఆయుర్వేద రిట్రీట్ వ్యవస్థాపకులు, ప్రకృతి వైద్య మరియు యోగా నిపుణులు డాక్టర్ కె.ఎన్. సుకుమార్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగా పాత్ర ఎంతో ముఖ్యమని వివరించారు. యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, శుద్ధి క్రియలు వంటి యోగా అంశాల వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. అనంతరం పాల్గొన్న వారికి యోగాసనాలు, ప్రాణాయామాలు, ధ్యాన విధానాలను ప్రాయోగికంగా నేర్పించారు. ఈ కార్యక్రమంలో రాజస్థానీ సమాజ్ అధ్యక్షులు శ్రీ శ్యామ్‌సుందర్ లహోటియా గారు, శ్రీ ఘనశ్యామ్ గారు, ఆయుష్ శాఖ యోగా శిక్షకులు, స్థానిక యోగా సాధకులు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు. ఈ శిబిరం జూన్ 15 నుండి జూన్ 30 వరకు ప్రతిరోజూ నిర్వహించబడుతుందని, పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని యోగా ద్వారా ఆరోగ్య ప్రయోజనాలు పొందాలని డాక్టర్ సుకుమార్ కోరారు. శిబిరంలో నమోదు మరియు మరిన్ని వివరాల కోసం 96522 27079 నంబర్‌ను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

## మిత్రుల విరాళాలతో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన బిఆర్ఎస్ యువజన నాయకుడు
### ఆర్థిక సహాయం అందజేత -- మానవత్వం చాటిన దాతలకు కృతజ్ఞతలు



గంగాధర, జూన్ 15 (ఇంద్ర ప్రభ ) : ఆపదలో ఉన్న ఓ పేద కుటుంబానికి గంగాధర మండలం ఉప్పరమల్యాల గ్రామానికి చెందిన 10వ వార్డు సభ్యుడు, బిఆర్ఎస్ యువజన నాయకుడు కల్లూరి మౌనిక అనిల్ యాదవ్ అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు లంకదాసరి మల్లయ్య ఇటీవల ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన మల్లయ్య కుటుంబం ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండగా ప్రమాదం కారణంగా వైద్య ఖర్చులు భారంగా మారాయి. ఈ పరిస్థితిని గమనించిన కల్లూరి మౌనిక అనిల్ యాదవ్ బాధిత కుటుంబానికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. వ్యక్తిగతంగా అందించే సహాయం పరిమితమవుతుందని భావించి, మరింత మంది దాతలను భాగస్వామ్యం చేసేందుకు సోషల్ మీడియా వేదికగా మల్లయ్య కుటుంబ పరిస్థితిని ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పిలుపునకు స్పందించిన దయార్ద్ర హృదయులు, బంధువులు, మిత్రులు తమకు తోచినంత విరాళాలు అందజేశారు. కేవలం రెండు రోజుల వ్యవధిలో రూ. 14,516ల విరాళాలు సమీకరించగా, ఆ మొత్తాన్ని సోమవారం కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మల్లయ్య కుటుంబ సభ్యులకు కల్లూరి మౌనిక అనిల్ యాదవ్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తమ కష్టకాలంలో అండగా నిలిచిన ప్రతి దాతకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కల్లూరి మౌనిక అనిల్ యాదవ్ మాట్లాడుతూ, సమాజంలో సేవా భావంతో ముందుకు వచ్చే మంచి మనసులు ఇంకా ఎంతో మంది ఉన్నారని పేర్కొన్నారు. మానవత్వంతో స్పందించి ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్క దాతకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. లంకదాసరి మల్లయ్య త్వరగా కోలుకొని ఆరోగ్యవంతుడై కుటుంబ సభ్యుల మధ్యకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

## దుబాయ్ లో ఒడ్డెలింగాపూర్ వాసి మృతి



ఇంద్ర ప్రభ రాయికల్ జూన్ 15వడ్లూరి రాజేందర్ ఒడ్డేలింగాపూర్ ఆరు నెలల క్రితం బతుకుదేరువు కోసం దుబాయ్ వెళ్లాడు. రెండు రోజుల క్రితం పుట్టినరోజు వేడుకలు జరుపుకోని ఆనందంగా గడిపారు. అదే రోజు రాత్రి హఠత్తుగా కుప్పకులడంతో..తోటి వారు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు అతనితో పనిచేసే వారు గ్రామస్తులకు సమాచారం అందించారు. మృతునికి బార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.

## ఘనంగా పాఠశాల
## పునః ప్రారంభ కార్యక్రమం



చందుర్తి, జూన్ 16, ఇంద్రప్రభ : చందుర్తి మండలం, మరిగడ్డలోని ఎస్ సి కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా పాఠశాల పునః ప్రారంభ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పాఠశాల ప్రవేశ ద్వారానికి మరియు ఆవరణలో అరిటాకులు, మామిడాకులు మరియు బెలూన్లతో ఉపాధ్యాయులు అలంకరించారు. విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు అందజేస్తూ ఒక్కొక్క విద్యార్థిని పాఠశాలకు ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమం చూసి విద్యార్థులు ఎంతో సంతోషించారు. తదనంతరం గ్రామ సర్పంచ్ దూది మనీషా శ్రీనివాస్ రెడ్డి చే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు భార్గవి మాట్లాడుతూ పాఠశాలలో విద్యాబోధన, ఆటలతో పాటు సహ పాఠ్య కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి మన ఊరు బడిని కాపాడుకోవాలని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామస్వామి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా అదనపు కలెక్టర్ గా
## బాధ్యతలు స్వీకరించిన కొప్పుల వెంకట్ రెడ్డి



పెద్దపల్లి స్టాఫ్ రిపోర్టర్ రవీందర్, జూన్-15, ఇంద్రప్రభ :పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా కొప్పుల వెంకట్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ)గా విధులు నిర్వహించిన కొప్పుల వెంకట్ రెడ్డికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పదోన్నతి లభించడంతో పెద్దపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకున్న ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులను కలుసుకున్న కొప్పుల వెంకట్ రెడ్డి, ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై
# తెలంగాణ సర్కార్ ఫోకస్



తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలలు, ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఇష్టారాజ్యంగా పెరుగుతున్న ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగింది. మధ్యతరగతి, పేద విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక ఉపశమనం కలిగించడమే లక్ష్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు (ఖీవవ =వస్త్రబశ్రీష్ఱశీఅ) తక్షణమే సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం విద్యాశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ నిబంధనల అమలులో ఎక్కడా, ఎవరితోనూ రాజీపడొద్దని, రూల్స్ అతిక్రమించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకునేలా మార్గదర్శకాలు ఉండాలని స్పష్టం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో, వీలైనంత త్వరగా అంటే ఈ నెలలోనే ఈ సరికొత్త ఫీజు నియంత్రణ చట్టాన్ని లేదా జీవోను తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను శాస్త్రీయంగా నియంత్రించేందుకు ప్రభుత్వం ఒక వినూత్న విధానాన్ని పరిశీలిస్తోంది. విద్యాసంస్థల్లో అందుబాటులో ఉన్న వసతులు, ల్యాబ్స్, ప్లే గ్రౌండ్ వంటి మౌలిక సదుపాయాల (×అటత్రీuర్‌తీబష్ఠబతీవ) ఆధారంగా స్కూళ్లను మొత్తం మూడు కేటగిరీలుగా (3 జఖవస్త్రశీతీఱవం) విభజించాలని యోచిస్తోంది. ఏ కేటగిరీకి చెందిన స్కూల్ ఎంత మేర ఫీజు వసూలు చేయాలనే దానికి సంబంధించి ఒక గరిష్ఠ ఫీజు పరిమితిని (మీa౯ఱఎబఎ ఖీవవ ఙబజూ) ప్రభుత్వం ఖరారు చేయనుంది. దీనివల్ల స్టార్ హోటళ్లను తలపించేలా కార్పొరేట్ స్కూళ్లు వసూలు చేసే అడ్డగోలు ఫీజులకు బ్రేక్ పడనుంది. ప్రభుత్వ పరిమితికి మించి ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసినా గుర్తింపు రద్దు చేసేలా చట్టాన్ని బలోపేతం చేయనున్నారు.

## సాయి మాధవ్ హోటల్‌లో
## అగ్నిప్రమాదం
### రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం:




మంచిర్యాల జూన్ 15, సత్యం స్టాఫ్ రిపోర్టర్ (ఇంద్రప్రభ న్యూస్ ) జిల్లా కేంద్రంలోని సాయి మాధవ్ హోటల్‌లో అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదం తీవ్ర కలకలం రేపింది. సోమవారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో హోటల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రాథమిక సమాచారం ప్రకారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. మంటలు వేగంగా వ్యాపించడంతో హోటల్‌లోని ఫర్నిచర్, విద్యుత్ పరికరాలు, వంట సామగ్రి, ఇతర వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ. 20 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు యాజమాన్యం అంచనా వేస్తోంది. అయితే అర్ధరాత్రి సమయంలో హోటల్‌లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఘటనపై పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు విచారణ చేపట్టారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలను అధికారులు పరిశీలిస్తున్నారు.

